తీరాల్లో కాలుష్యానికి అడ్డుకట్ట

- జీవులను కాపాడేందుకు ప్రత్యేక ప్రణాళిక
- రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యంగా 15 ప్రాంతాల ఎంపిక
- కేంద్ర, రాష్ట్ర శాఖలకు కీలక బాధ్యతలు

చమురు తెట్టు



ఈ ఏడాది జనవరిలో వరదల సమయంలోనే తిరువళ్లూరు జిల్లా ఎన్నూరులో ముడిచమురు వ్యర్థాలు సముద్రంలో కలవడంతో భారీ కలకలం రేగింది. చుట్టుపక్కల ఊళ్లు, కాలనీలు, ఎన్నో జాతుల జీవులపై తీవ్ర ప్రభావం చూపింది. కోర్టులు సైతం కాలుష్యంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో ఎన్నూరుతో పాటు రాష్ట్ర తీరంలో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ప్రాంతాలన్నింటికీ రక్షణగా ఉండేలా తమిళనాడు ప్రభుత్వం వ్యూహాలు రచించింది. ఈనాడు-చెన్నై

ముడిచమురు చిందే విపత్తుపై అత్యవసర ప్రణాళిక (టీఎన్-ఎస్వో ఎస్-డీసీపీ)ను తమిళనాడు రూపొందించింది. సముద్రంలోకి నీరు కలిసే మార్గాలు, చుట్టుపక్కల తీరంలో ముడిచమురు వ్యర్థాలు కలిసినప్పుడు పర్యావరణ ప్రభావాల్ని నియంత్రించేలా ఏం చేయాలనేదానిపై ప్రత్యేక విపత్తు ప్రణాళికలతో రాష్ట్రం ముందుకొచ్చింది. అలాంటి ముప్పు ఉన్న ప్రాంతాల్ని జల్లెడ పట్టింది. ప్రత్యేకంగా అత్యున్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసి రాష్ట్రంలోని ప్రాంతాలను పరిశీలన చేయించింది. దీనిపై రూపొందించిన 186 పేజీల నివేదికను తాజాగా ప్రభుత్వం విడుదల చేసింది.

ముందుగా సంరక్షించే ప్రాంతాలివి..

- గల్ఫ్ ఆఫ్ మన్నార్
- తూత్తుకుడి
- పిచ్చావరం, కొళ్లిడం, వెళ్లారు
- మణప్పాడు బీచ్‌లు
- రామేశ్వరం, తిరుచ్చెందూరు
- వేదారణ్యం, ముత్తుపేట
- తొండి దక్షిణాన ఉన్న పాక్ జలసంధి
- కన్నియాకుమరి
- మణవాళకురిచ్చి బీచ్‌లు
- పుదుక్కోట్టై మడఅడవులు, తంజావూరు తీరం
- నాగపట్టిణంలోని తరంగంబాడి బీచ్‌లు, వేళాంకణ్ణి
- మామల్లాపురం
- కలివెళి, చెయ్యూర్
- చెన్నైలోని మెరీనా, ఎలైట్ బీచ్‌లు
- పులికాట్ సరస్సు

తీవ్రమైనవి చాలానే..

తీరంలో ముడిచమురు వ్యర్థాల కారణంగా పర్యావరణానికి హానికరంగా ఉండే ప్రాంతాల్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ ఏడాది ఘటన చోటుచేసుకున్న ఎన్నూరు క్రీక్‌తో పాటు గల్ఫ్ ఆఫ్ మన్నార్, పిచ్చావరం మడ అడవులకు అత్యంత ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఎంపిక చేశారు. వాటితో పాటు కోవలం, కొళ్లిడం, కల్పాక్కం, రామనాథపురం, తూత్తుకుడి, తిరువళ్లూరు తీరాల్ని అతిఎక్కువ ప్రమాదకర తీరాలుగా గుర్తించారు. చెన్నై, కన్నియాకుమరి ప్రాంతాల్ని ఎక్కువ ప్రమాదకర ప్రాంతాలుగా విభజించారు. ఇలా టైర్-1, 2, 3 స్థాయిలుగా విభజించారు. ఇందులో ఎక్కువ ప్రాధాన్యంగా 15 ప్రాంతాల్ని ముందువరసలో ఉంచారు.

పోర్టులతోనే ముప్పు..

తమిళనాడు తీర ప్రాంతం 1,076 కి.మీ మేర ఉంది. ఇందులో చెన్నై, ఎన్నూరు, తూత్తుకుడి తీరాల్లో మూడు ప్రధాన పోర్టులున్నాయి. వాటినుంచి రోజుకు 0.68 టన్నుల నుంచి 1.19 టన్నుల వరకు సముద్రమార్గాన ట్యాంకర్ల ద్వారా ముడిచమురు సరఫరా అవుతుంటుంది. ఇక్కడినుంచి విశాఖపట్నం, పారాదీప్, హల్దియా, కోల్‌కతాకు తరలుతుంటాయి. ఆయా ప్రాంతాల్లో సముద్రంలోకి ముడిచమురు లీకేజీ సైతం బాగానే ఉంటోంది. ఈ తరహాలో పలు ఘటనలూ చోటుచేసుకున్నాయి.

బలగాలతో సన్నద్ధం



తమిళనాడు తీరంలో ముప్పుబారిన ఉన్న ప్రాంతాల్ని తెలిపే మ్యాప్

మొత్తం 14కు పైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్ని ఈ విపత్తును ఎదుర్కోవడంలో బాధ్యులుగా చేస్తున్నారు. ప్రధానంగా తీరగస్తీ దళాలు, పోర్టులు, రాష్ట్ర విపత్తు నిర్వాహణ సంస్థ, కేంద్ర రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖలు, కాలుష్య నియంత్రణ మండలి, మారిటైంబోర్డు, తీరపోలీసు బలగాలు, మత్స్యశాఖ, వివిధ పరిశోధన సంస్థలు, ఆయిల్ కంపెనీ సంస్థలు తదితరుల్ని ఇందులో భాగం చేశారు.

విలువైనవిలా..

రకం	విస్తీర్ణం (చ.కి.మీ.లలో)
రిజర్వ్ ప్రాంతాలు	888.91
సముద్రపచ్చిక	398.81
బురదమైదానాలు	189.43
మడఅడవులు	119.13
ఉప్పు చిత్తడినేలలు	59.40
ఇసుకదిబ్బలు	31.03
పగడాలు	23.30
తాబేళ్ల స్థావరాలు	2.78
వారసత్వ, చారిత్రక స్థలాలు	0.79



జీవవైవిధ్యానికి ప్రమాదకరంగా చమురు లీకేజీ

రాష్ట్రంలో..

జీవులు	జాతుల సంఖ్య
పక్షులు	454
క్షీరదాలు	187
సరీసృపాలు	177
చేపలు	165
ఉభయచరాలు	76

24-40కి.మీ మేర రక్షణ

చమురు చిందే విపత్తు ఉండే అవకాశాలున్న ప్రాంతాల్లో చేపట్టాల్సిన అత్యవసర చర్యలపై ప్రత్యేక ప్రణాళికల్ని ఆయా జిల్లా అధికారులకు పంపారు. విపత్తు సంభవించగానే ప్రణాళికలోని అంశాలకు తగిన యంత్రాలు, పరికరాలు, ఇతర జాగ్రత్తలతో రంగంలోకి దిగాల్సి ఉంటుందని వివరించారు. విపత్తు జరిగిన ప్రాంతం నుంచి చుట్టూ 24 కి.మీ. నుంచి 40 కి.మీ. మేర రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతీయ, రాష్ట్ర ఏజెన్సీలు ఈ పద్ధతుల్ని పాటించాల్సి ఉంటుందన్నారు. ఈ మొత్తం ప్రక్రియను జిల్లా కలెక్టర్ పర్యవేక్షిస్తారని వివరించారు. ఇదివరకు ఇలాంటి విపత్తులు తీరంలో సంభవించినప్పుడు తీరగస్తీ దళాలు మాత్రమే స్పందించేవారు. ఇకపై వారితో కలిసి రాష్ట్ర బలగాలు పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు.

విజయ్ రాజకీయ అరంగేట్రంతో సీమాన్‌లో భయం

● ఎన్టీకే మాజీ నిర్వాహకులు

చెన్నై, న్యూస్‌టుడే: నటుడు విజయ్ రాజకీయ అరంగేట్రంతో సీమాన్‌లో భయం పట్టుకుందని నామ్ తమిళర్ కట్చి రాష్ట్ర మాజీ కన్వీనర్ వెట్రి కుమరన్, మాజీ నిర్వాహకులు పుగళేంది మారన్, ధనశేఖరన్ ఆరోపించారు. చెన్నై ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీలంకలో ఈళం తమిళుల ఊచకోతకు రాష్ట్రానికి చెందిన పార్టీలు ఎలాంటి నిరసనగళం విప్పలేదన్నారు. నామ్ తమిళర్ కట్చి చీఫ్ కన్వీనర్ సీమాన్ మొదట్లో బాగానే ఉన్నారని, కొంతకాలంగా నిరంకుశ ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఆర్థికంగా, కుటుంబపరంగా పలు ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ప్రస్తుతం పార్టీ నుంచి బయటకు వచ్చేశామని తెలిపారు. సీమాన్‌ను నిరాకరించిన యువత, నిర్వాహకులు, తమిళాన్ని ప్రాణంగా భావించే అందరూ 'తమిళర్ ఒరుంగినైప్పు ఇయక్కం' పేరిట ఏకమయ్యామని పేర్కొన్నారు. తమిళ ఈళం విముక్తి ఉద్యమంలోని మృతులకు నవంబరు 27న తిరుచ్చిలో నివాళి అర్పించనున్నామని తెలిపారు. అక్కడ సమాలోచన నిర్వహించిన తర్వాత రాజకీయ ప్రయాణం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. సీమాన్‌లో ఆత్మవిశ్వాసం లేదని, విజయ్ రాజకీయ అరంగేట్రంతో భయం పట్టుకుందని విమర్శించారు.



విలేకర్లతో మాట్లాడుతున్న వెట్రి కుమరన్, పుగళేంది మారన్, ధనశేఖరన్

టీవీకే పుదువై రాష్ట్ర కార్యదర్శి శరవణన్ మృతి



వేళచ్చేరి, న్యూస్‌టుడే: టీవీకే పుదువై రాష్ట్ర కార్యదర్శి శరవణన్ (47) గుండెపోటుతో కన్నుమూశారు. పుదుచ్చేరి సిత్తన్‌కుడికి చెందిన శరవణన్‌కు భార్య దేవి, ఓ కుమారుడు ఉన్నారు. ఈయన కళాశాలలో చదివేటప్పుడే విజయ్‌కు వీరాభిమాని. పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్‌కు అత్యంత సన్నిహితుడు. గత కొద్ది రోజులుగా పార్టీ మహానాడు జరిగే విక్రవాండిలో బస చేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో శరవణన్ సోమవారం రాత్రి మహానాడు జరిగే చోటు నుంచి పుదుచ్చేరికి చేరుకున్నాడు. ఇంట్లోకి వెళ్లిన కొద్దిసేపటికే గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు.

విజయ్ సంతాపం

చెన్నై: శరవణన్ మృతికి పార్టీ అధ్యక్షుడైన నటుడు విజయ్ విచారం వ్యక్తం చేశారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో... తనపై, పార్టీపై భక్తి కలిగిన శరవణన్ ఆకస్మిక మృతివార్త దిగ్భ్రాంతి, ఆవేదనను కలిగించిందన్నారు. ఆయన్ను కోల్పోయి బాధపడుతున్న కుటుంబ సభ్యులు, బంధుమిత్రులకు తన ప్రగాఢ సానుభూతి వెల్లడించారు.

యోగా ఉపాధ్యాయులకు వేతనాలు అందజేయాలి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: యోగా ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు అందజేయాలని మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్ సెల్వం డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఆయుష్మాన్ భారత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 2022లో రాష్ట్రంలోని పలు ఆస్పత్రుల్లో యోగా శిక్షకులను నియమించిందని తెలిపారు. ఏడాది లోపల వారిని తొలగించి వారికి బదులు నేచరోపతి, యోగా సైన్సు కోర్సు పూర్తి చేసినవారిని డీఎంకే ప్రభుత్వం నియమించిందని, దీనికి వ్యతిరేకంగా న్యాయస్థానంలో స్టే పొందినట్లు తెలిసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో 14 నెలలుగా వారికి జీతాలు ఇవ్వలేదని, కేసు పెండింగ్‌లో ఉన్నందున ఇవ్వడం కుదరదని ప్రభుత్వం చెబుతోందని యోగా టీచర్ల సంఘం ఆందోళన చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే వారికి అందాల్సిన 14 నెలల వేతనాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

● **హోసూర్ విమానాశ్రయం త్వరగా పూర్తిచేయాలి:** ఆయన మరో ప్రకటనలో.. కృష్ణగిరి, ధర్మపురి జిల్లాలు సామాజిక అభివృద్ధి సాధించే విధంగా హోసూరులో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. అయితే ఇక్కడ విమానాశ్రయం నిర్మిస్తే బెంగళూరు విమానాశ్రయం ప్రాధాన్యత తగ్గుతుందని భావించి కర్ణాటక ప్రభుత్వం బెంగళూరు సమీప సోమనహళ్లిలో రెండో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోందన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయాలకు మధ్య 50 కి.మీ దూరం ఉండాలనే నిబంధన ఉందన్నారు. అయితే సోమనహళ్లికి, హోసూరుకు మధ్య దూరం 47 కి.మీ మాత్రమే ఉందన్నారు. కావున హోసూరులో విమానాశ్రయం ఏర్పాటుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని సూచించారు.

టీ నగర్‌లో భద్రతా ఏర్పాట్లు పరిశీలన

ప్యారిస్, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా చెన్నై టీ నగర్‌లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ తెలిపారు. పండుగ నేపథ్యంలో కొత్త దుస్తులు, ఇతర వస్తువుల కొనుగోలుకు టీ నగర్, పురసైవాక్కం తదితర ప్రాంతాలకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. టీ నగర్‌లో మంగళవారం పోలీసు కమిషనర్ అరుణ్ పర్యటించారు. కంట్రోల్‌రూమ్‌ను ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రంగనాథన్‌వీధిలో 64 కెమెరాలు, 7 వాచ్‌టవర్లు ఏర్పాటు చేశామన్నారు. పిల్లలు తప్పిపోకుండా వారి చేతికి ట్యాగ్‌లు కడుతున్నామని చెప్పారు. పాత నిందితుల ఫొటోలు, వివరాలు తమ వద్ద ఉన్నాయని, వారు జనరద్దీలో ఉంటే గుర్తించి వెంటనే హెచ్చరిస్తారన్నారు. తాంబరం, కిలాంబాక్కం తదితర ప్రాంతాల్లో బస్టాండ్లు ఉండటంతో కోయంబేడులో ట్రాఫిక్ సమస్య తగ్గిందన్నారు.



కంట్రోల్ రూమ్‌ను ప్రారంభిస్తున్న పోలీసు కమిషనర్ అరుణ్

ద్రావిడం అంటే పలువురికి అలర్జీ

మంత్రి తంగం తెన్నరసు

ప్యారిస్, న్యూస్‌టుడే: ద్రావిడం, ద్రావిడర్ అనే పదాలు చాలామందికి అలర్జీలా ఉన్నాయని మంత్రి తంగం తెన్నరసు అన్నారు. మదురైలో పాండ్యనాడు హిస్టారికల్ రిసెర్చ్ సెంటర్ తరపున రాజేంద్రం అనే పుస్తకాన్ని సోమవారం మంత్రి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. సింధులోయ నాగరికత, ద్రావిడ నాగరికం ఒకటే అని నిరూపించేందుకు తమిళనాడు ప్రభుత్వం పరిశోధన చేపట్టిందన్నారు. దేశస్థాయిలో ఆదిచ్చనల్లూర్ తవ్వకాలే తొలిసారిగా ప్రారంభించిన పరిశోధన అన్నారు. తవ్వకాలు నిజమైన సమాచారాన్ని బయటకు తీసుకొచ్చి, వాస్తవ చరిత్రను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని తెలిపారు.

కవరైపేట్టై రైల్వేస్టేషన్ అధికారుల వద్ద దర్యాప్తు

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: గుమ్మిడిపూండి సమీప కవరప్పేట్టైలో ఈనెల 11న లూప్‌లైన్‌లో ఆగిన గూడ్స్ రైలును భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో 12 బోగీలు బోల్తాపడ్డాయి. అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది. ఘటనా స్థలాన్ని రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ కమిషనర్, ఉన్నతాధికారులు సందర్శించారు. ప్రమాదానికి గల కారణంపై దర్యాప్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి స్టేషన్ మాస్టర్‌తో పాటు 21 మందికి సమ్మన్లు జారీ చేశారు. వీరి వద్ద వారం రోజులుగా చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో డీఎస్పీ నేతృత్వంలోని సీఐల బృందం దర్యాప్తు చేపట్టింది. అందులో భాగంగా కవరప్పేట్టైలో స్టేషన్ మాస్టర్, సూపరింటెండెంటు, సిగ్నల్‌మ్యాన్, గేట్ కీపర్ వద్ద మంగళవారం దర్యాప్తు చేపట్టారు. అదే విధంగా మెకానికల్, సివిల్ వర్క్స్, ట్రాఫిక్ విభాగ సిబ్బంది వద్ద కూడా దర్యాప్తు చేశారు. సీసీ టీవీ కెమెరాలు, సిబ్బంది ఫోన్‌కాల్స్‌ను ట్రేస్ చేశారు. ఘటనను ప్రత్యక్షంగా చూసిన వారి వద్ద కూడా దర్యాప్తు జరిగింది.



దీపావళిని పురస్కరించుకుని 15 రకాల కిరాణా వస్తువులతో కూడిన, రూ.499 విలువైన కిట్‌ను చెన్నై గోపాలపురం తమిళనాడు పౌరసరఫరాల శాఖ జోనల్ కార్యాలయంలో అందిస్తున్న మంత్రి చక్రపాణి

\- న్యూస్‌టుడే, విల్లివాక్కం

వచ్చేనెలలో వాతావరణ పార్క్ ప్రారంభం

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా వండలూర్ సమీపాన కిలాంబాక్కంలో కొత్తగా నిర్మించిన బస్ టెర్మినస్ ప్రాంగణంలో 16 ఎకరాల విస్తీర్ణంలో రూ.15.20 కోట్లతో వాతావరణ పార్క్ ఏర్పాటు చేశారు. నడకదారి, పూల మొక్కలు, పిల్లల పార్క్, క్రీడా పరికరాలతో పాటు అనేక వసతులు కల్పిస్తున్నారు. ఆ పనులను మంగళవారం ఉదయం మంత్రులు శేఖర్‌బాబు, టీఎం అన్బరసన్ పరిశీలించారు. శేఖర్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకే ప్రభుత్వంలో బస్ టెర్మినస్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం డీఎంకే పాలనలో సీఎండీఏ తరపున పూర్తి చేసి సీఎం ప్రారంభించారని గుర్తుచేశారు. ప్రయాణీకులకు అవసరమైన వసతులు దశలవారీగా కల్పిస్తున్నామని తెలిపారు. వాతావరణ పార్క్‌లో మనసుకు ఆహ్లాదం కలిగించేలా వివిధ రకాల మొక్కలు, వర్షపునీటి సంరక్షణ, ప్రజల నడకదారి, చిల్డ్రన్స్ పార్క్ తదితర సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ముడిచ్చూర్ బస్ టెర్మినస్, వాతావరణ పార్క్‌ను వచ్చే నెల సీఎం ప్రారంభిస్తారని పేర్కొన్నారు.



పార్క్ లోపల ఇలా..

కరుణానిధి విగ్రహావిష్కరణ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్‌లో దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి నిలువెత్తు విగ్రహాన్ని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం ఆవిష్కరించారు. నామక్కల్ ఈస్ట్ జిల్లా డీఎంకే తరపున పరమత్తి సాలైలోని చెలంబగౌండర్ పార్కు ప్రాంగణంలో కరుణానిధి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. స్టాలిన్ ఆవిష్కరించి, మాలవేసి పుష్పాంజలి ఘటించారు. ఈ విగ్రహానికి సమీపంలోని ఎంజీఆర్ విగ్రహానికి కూడా నివాళులర్పించారు. మంత్రులు, ఎంపీలు, పార్టీ నిర్వాహకులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నామక్కల్‌లో ట్రాఫిక్ మార్పులు చేశారు.



విగ్రహావిష్కరణలో ముఖ్యమంత్రి స్టాలిన్ తదితరులు

పుదుచ్చేరిలో రేషన్ దుకాణాలు ప్రారంభం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో ఎనిమిదేళ్ల తర్వాత రేషన్‌దుకాణాలను మళ్లీ తెరిచారు. దీపావళి సందర్భంగా ఉచితంగా 10 కిలోల బియ్యం, 2 కిలోల చక్కెర అందించే కార్యక్రమం మేట్టుపాళ్యం తొలిల్‌పేట్టై రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగింది. ఎల్జీ కైలాష్‌నాథన్, ముఖ్యమంత్రి రంగసామి ఉచితంగా నిత్యావసరాలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎల్జీ మాట్లాడుతూ.. ప్రజల ఏళ్లనాటి కోరిక నెరవేరిందన్నారు. దేశంలో ఎవరూ ఆకలితో అలమటించకూడదనే లక్ష్యంగా ఆహార భద్రతా చట్టాన్ని ప్రధాని మోదీ ప్రవేశపెట్టారని తెలిపారు. రేషన్‌దుకాణాలు కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటి వద్దకే ఉచితంగా బియ్యం అందించేందుకు పరిశీలిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రితో అందుకు సంబంధించి చర్చలు జరిపి అమలుచేస్తామన్నారు.



నిత్యావసరాలు అందిస్తున్న ఎల్జీ కైలాష్‌నాథన్, సీఎం రంగసామి

రూ.కోట్ల విలువైన స్థలాన్ని ఆక్రమించిన మంత్రి

● అరప్పోర్ ఇయక్కం

ప్యారిస్, న్యూస్‌టుడే: మంత్రి రాజకన్నప్పన్ తన కుమారుల పేరిట రూ.411 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు అరప్పోర్ ఇయక్కం ఫిర్యాదు చేసింది. అరప్పోర్ ఇయక్కం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో.. చెన్నై జీఎస్టీ సాలైలోని ఐదెకరాల ప్రభుత్వ భూమిని మంత్రి అధికారాన్ని దుర్వినియోగం చేసి కుటుంబ ఆధీనంలో ఉంచుకున్నారని పేర్కొంది. ఇందుకు సంబంధించిన ఆధారాలు అవినీతి నిరోధక శాఖ, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి తదితరులకు పంపినట్లు తెలిపింది. మంత్రి ఒత్తిడి కారణంగా రెవెన్యూశాఖ అధికారులు చూసీచూడనట్లు వదిలేశారన్నారు. ఆ స్థలాన్ని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని, చట్ట విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని కోరింది.

ప్రత్యేక పరికరంతో విద్యుత్తు ప్రమాదాలు అరికట్టొచ్చు

వడపళని, న్యూస్‌టుడే: ఇటీవలి వర్షాల్లో పలువురు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్(టీఎన్‌పీడీసీఎల్) వినియోగదారులకు కొన్ని సూచనలందించింది. గృహవాసులతో పాటు లోటెన్షన్ వినియోగదారులందరూ ఎర్త్ లీకేజీ సర్క్యూట్‌ను అడ్డుకునే రెసిడ్యువల్ కరెంట్ డివైస్(ఆర్సీడీ)ని ఏర్పాటు చేసుకోవాలని పేర్కొంది. ఈ పరికరం ఏర్పాటు చేసుకుంటే ప్రమాదాల బారిన పడరని తెలిపింది. ఈనెల 15న పెరియమేట్‌లోని తోలు సంస్థ యజమాని దుకాణంలోని స్విచ్‌ను ఆపే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అదే రోజు పుళల్‌లో ఓ పూజారి ఆలయ తలుపులు తెరుస్తుండగా తలుపునకు విద్యుత్తు సరఫరా జరిగి ప్రమాదానికి లోనయ్యాడు. సర్వీసు కనెక్షన్లకు ఎర్త్ లీకేజ్ సర్క్యూట్ బ్రేకర్(ఈఎల్‌సీబీ) కలిసి ఉంటే ప్రమాదాన్ని అరికట్టొచ్చని టాన్‌జెడ్కో అధికారులు పేర్కొన్నారు. పలు సందర్భాల్లో వినియోగదారులకు అవగాహన కల్పించినా చాలామంది పట్టించుకోవడం లేదు. పిండి రుబ్బే యంత్రాలు, మిక్సీలు, గీజర్లు, ఇస్త్రీ పెట్టెల నుంచి ఇండక్షన్ ఉత్పత్తి అవుతుందని, ఎర్తింగ్ సరిగా లేకుంటే విద్యుదాఘాతం సంభవించే ప్రమాదముందన్నారు. 'ఈఎల్‌సీబీ' పరికరం అమర్చుకుంటే స్వల్ప విద్యుదాఘాతం నుంచి రక్షిస్తుందని చెప్పారు. సర్క్యూట్ బ్రేకర్ పరికరాన్ని తిరిగి అమర్చడం కూడా తేలికేనని, స్విచ్‌లాగానే పని చేస్తుందన్నారు. పలువురు వినియోగదారులకు వాటి గురించి అంతగా తెలియదని అధికారి ఒకరు చెప్పారు. 30ఎంఏ రెసిడ్యువల్ కరెంట్ డివైజ్(ఆర్సీడీ) రూ.2 వేల వరకు ఉంటుందని, ఇప్పటికే కనెక్షన్లు ఉన్నవారు కూడా ఏర్పాటు చేసుకోవచ్చని టీఎన్‌పీడీసీఎల్ ప్రకటనలో పేర్కొంది.



ఈఎల్‌సీబీ

డ్రగ్స్ చలామణి అడ్డుకోండి: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: డ్రగ్స్ చలామణి అడ్డుకోవాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్షనేత ఎడప్పాడి పళనిసామి డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో.. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మత్తుపదార్థాల వినియోగం పెరిగిందని ఆరోపించారు. ఇటీవల జరిగిన దక్షిణాది రాష్ట్రాల శాంతిభద్రతల పరిరక్షణ సదస్సులో ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ తమిళనాడులో గంజాయి సాగును అడ్డుకున్నట్లు గొప్పగా చెప్పారన్నారు. తమిళనాడుకు అక్రమంగా డ్రగ్స్ తరలించటాన్ని అడ్డుకోవాలని పొరుగు రాష్ట్రాల డీజీపీలకు సూచనలు కూడా చేయలేదని ఆరోపించారు. డ్రగ్స్ రహిత తమిళనాడుకు డీఎంకే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

● **26న కాంచీపురంలో సమావేశం..** అన్నాడీఎంకే 53వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 26న కాంచీపురంలో సమావేశం జరగనున్నట్లు అన్నాడీఎంకే అధిష్ఠానం ప్రకటించింది. ఈ సమావేశం 17న జరగాల్సి ఉండగా వర్షం కారణంగా వాయిదా వేశారు.

● **25న ఆందోళన..** ధర్మపురి మున్సిపాలిటీలో ఇలక్కియంపట్టి పంచాయతీని విలీనం చేయాలన్న ప్రభుత్వ తీరును ఖండిస్తూ ధర్మపురి జిల్లా అన్నాడీఎంకే తరపున 25న ఆందోళన చేయనున్నట్లు ప్రకటించింది. విలీనం ద్వారా సంబంధిత గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ కూలీలు నష్టపోతారని తెలిపింది.

క్షమాపణ కోరితే పార్టీలో చేర్చుకోవడాన్ని పరిశీలిస్తారు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే నుంచి తొలగించినవారు క్షమాపణ కోరితే తిరిగి చేర్చుకునే విషయాన్ని ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తీర్మానిస్తారని ఆ పార్టీ డిప్యూటీ కార్యదర్శి కె.పి. మునసామి పేర్కొన్నారు. తెన్‌పెన్నై నది నుంచి భారీగా నీటిని విడుదల చేస్తున్నారు. కె.పి.మునుసామి, కృష్ణగిరి ఎమ్మెల్యే అశోక్‌కుమార్, ఊత్తంగరై ఎమ్మెల్యే తమిళ్‌సెల్వం తదితరులు మంగళవారం నదిని పరిశీలించారు. మునుసామి విలేకరులతో మాట్లాడుతూ.. తిరుమావళవన్, వేల్ మురుగన్ పార్టీ కోసం మాత్రమే కాక అణగారిన సమాజం కోసం పోరాడి ప్రధాన నాయకులుగా ఎదిగారని ప్రశంసించారు. వారిద్దరు ఏ కూటమిలో ఉన్నా సమాజం కోసం గళంవిప్పి ఐక్యంగా పోరాడాలని హితవు పలికారు. ఎంజీఆర్, జయలలిత హయాం నుంచి తప్పు చేసిన వారిని పార్టీనుంచి బహిష్కరిస్తున్నారన్నారు.




నీటి విడుదల పరిశీలిస్తున్న కె.పి.మునుసామి తదితరులు

వసతులెలా ఉన్నాయి?

మహాబలిపురం, న్యూస్‌టుడే: కార్మిక, నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రి సి.వి.గణేశన్ మంగళవారం ఉదయం చెంగల్పట్టు జిల్లా పల్లావరంలోని సీఎస్ఐ వైద్య విద్య కళాశాల, ఆసుపత్రిలో తనిఖీలు నిర్వహించారు. అక్కడి చికిత్స, సదుపాయాలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు, సిబ్బంది హాజరు, ఆసుపత్రిలో ఔషధాల నిల్వను తనిఖీ చేశారు. ఆసుపత్రి ద్వారా 68 వేల మంది కార్మికులు లబ్ధి పొందుతున్నారు. మంత్రి వెంట సీఎస్ఐ వైద్యశాల డైరెక్టర్ డాక్టరు ఇలంగో మహేశ్వరన్, డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు.



పల్లావరం సీఎస్ఐ ఆసుపత్రిలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న మంత్రి సి.వి.గణేశన్



వెలుగుచూసిన రాగి శిలాశాసనాలు

పురాతన రాగి శిలాశాసనాలు లభ్యం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప మప్పేడులో పురాతన శ్రీసింగీశ్వరుడి ఆలయం ఉంది. కూడిన రాష్ట్ర హిందూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలోని ఈ క్షేత్రంలో ఈవో ప్రకాష్ సిబ్బందితో లాకర్‌ను శుభ్రం చేయిస్తుండగా విజయనగర సామ్రాజ్య ముద్రతో కూడిన 2 రాగి శిలాశాసనాలు లభ్యమయ్యాయి. సంస్కృతం, నందినాగరి లిపిలో ఉన్న ఇవి శ్రీకృష్ణదేవరాయలు (1513) కాలం నాటివని జిల్లా పురావస్తు పరిశోధనశాఖ అధికారి లోకనాథన్ వెల్లడించారు. అనంతరం వాటిని కర్ణాటక రాష్ట్రం మైసూరులోని కేంద్ర పురావస్తు పరిశోధన శాఖ కార్యాలయానికి పంపించినట్లు పేర్కొన్నారు. అక్కడ పరిశోధనలు పూర్తయిన తర్వాత అందులోని విషయాలు తెలిసే అవకాశం ఉందన్నారు.

తిరుత్తణి ఆలయ హుండీ కానుకల లెక్కింపు



నగదు లెక్కిస్తున్న సిబ్బంది

తిరుత్తణి, న్యూస్‌టుడే: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ హుండీ ద్వారా రూ. 80.07 లక్షల ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో.. 17 రోజులుగా వసూలైన కానుకలను సోమవారం లెక్కించినట్లు పేర్కొన్నారు. ఆలయ జాయింట్ కమిషనర్ రమణి పర్యవేక్షణలో సుమారు 100 మంది సిబ్బంది పాల్గొన్నారు. రూ. 80.07 లక్షల నగదు, 234 గ్రాముల బంగారం, 3,456 గ్రాముల వెండి కానుకలు అందాయన్నారు. ఆలయ పునరుద్ధరణ పనులకు ప్రత్యేకించి ఏర్పాటు చేసిన హుండీ ద్వారా మరో రూ. 1.73 లక్షలే అందినట్లు వివరించారు.

తత్వజ్ఞాని డ్రూయిడ్ విగ్రహం రూపకల్పన



తత్వజ్ఞాని విగ్రహం

మహాబలిపురం, న్యూస్‌టుడే: ఐర్లాండ్ దేశంలో 16వ శతాబ్దంలో జీవించిన ప్రాచీన సంస్కృతి తత్వజ్ఞాని పీయోన్ సంగీత కళాకారుడైన డ్రూయిడ్ ఫైబర్ విగ్రహాన్ని 8 అడుగుల వెడల్పు, 19 అడుగుల ఎత్తుతో మహాబలిపురంలోని ఓ శిల్పాలయంలో రూపొందిస్తున్నారు. ఈ విగ్రహాన్ని ఐర్లాండ్ దేశంలో వక్ట్‌ర్స్‌వే శిల్ప పార్క్‌లో నెలకొల్పనున్నారు. విగ్రహానికి కుడిచేతిలో పిరమిడ్‌లో ఉన్న గ్రద్దతో కలిసిన పొడవాటి కర్ర, ఎడమ చేతిలో బాంబులు, కాళ్ల కింద గుంటనక్క ఉన్నట్లు శిల్పకళాకారుడు మురుగన్ 8 మంది శిల్పులతో కలిసి తయారు చేశారు. మొదట్లో విగ్రహాన్ని బంకమట్టితో, తరువాత ప్లాస్టర్ ఆఫ్ పారిస్ మిశ్రమాన్ని ఉపయోగించి నమూనా తయారు చేశారు. తరువాత ఫైబర్‌తో విడివిడిగా తయారు చేసిన భాగాలతో రూపొందించారు. త్వరలో ఓడలో ఐర్లాండ్ పంపనున్నారు.

నగల పొదుపు పథకానికి ఆదరణ

▸ 25 శాతం పెరిగిన పెట్టుబడిదారులు

▸ నగల ధర పెరగడమే కారణం



రాష్ట్రంలో రికార్డు స్థాయిలో పసిడి ధరలు పెరగడంతో నగల పొదుపు పథకంలో ప్రజలు పెట్టుబడి పెడుతున్నారు. ఈ క్రమంలో పొదుపు చేసుకుంటున్న వారి సంఖ్య 25 శాతానికి పెరిగినట్టు తెలుస్తోంది. దేశంలో పసిడి వినియోగం, విక్రయాలలో రాష్ట్రం ముందంజలో ఉంది. అందువల్ల రాష్ట్రవ్యాప్తంగా చిన్న, పెద్ద కలిపి మొత్తం 35 వేల బంగారు నగల దుకాణాలు ఉండగా సగటున 15 వేల కిలోల నగలు విక్రయమవుతున్నాయి. దీపావళి, అక్షయతృతీయ వంటి శుభ సందర్భాల్లో మొత్తం నగదు చెల్లించి నగలు కొనుగోలు చేసుకోలేని వారు నగల దుకాణాలలో నెలవారీ నగల పొదుపు పథకంలో సభ్యులుగా చేరి రూ.వెయ్యి నుంచి రూ.10 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు.

న్యూస్‌టుడే, విల్లివాక్కం

ఎగబాకుతున్న ధరలు

శుభదినాలలో పొదుపు చేసిన డబ్బు పొంది నగలు కొనుగోలు చేసుకుంటున్నారు. పొదుపు పథకంలో చేరిన వారికి బహుమతులు అందజేయడంతో పాటు కూలీలు తదితర రాయితీలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం కొన్ని దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం, అమెరికా, ఐరోపా సెంట్రల్ బ్యాంకుల డిపాజిట్ల తగ్గింపు తదితర కారణాల రీత్యా ప్రపంచ పెట్టుబడిదారులు భద్రతను దృష్టిలో ఉంచుకుని బంగారంపై పెట్టుబడి పెడుతున్నారు. దీంతో ప్రపంచ మార్కెట్‌లో పసిడి ధర ఎగబాకుతోంది. దేశంలో ధరలు పెరుగుతున్నాయి. శనివారం గ్రాము రూ. 40 పెరిగి రూ. 7,280 చేరింది. సవర రూ. 58,240కు పెరిగింది. వెండి గ్రాము రూ. 107కు చేరుకోగా కిలో రూ. 1.07 లక్షలకు పెరిగింది. ఈ ఏడాది జనవరి 1వ తేదీ సవర రూ. 47,820 విక్రయం కావడం గమనార్హం. పది నెలల్లో రూ. 10,420 అధికమైంది.

తగ్గని విక్రయాలు

దీని గురించి చెన్నై బంగారు, వజ్రాల వ్యాపారుల సంఘ అధ్యక్షుడు జయంతిలాల్ సలాని మాట్లాడుతూ.. గత 6 నెలలుగా బంగారం ధర చాలా వరకు పెరిగిందని, దీంతో మొత్తం డబ్బు చెల్లించి కొనుగోలు చేయడానికి క్రమపద్ధతిలో పొదుపు పద్ధతిని భావించి పలువురు నగల దుకాణాలలో పొదుపు పథకాలలో పెట్టుబడి పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో పెట్టుబడిదారుల సంఖ్య 25 శాతానికి పెరిగిందని చెప్పారు. ఒక దుకాణంలో వెయ్యి మందికి పైగా పథకంలో చేరుతున్న క్రమంలో ప్రస్తుతం మరో 25 శాతం పెరిగినట్టు వివరించారు. దీపావళికి నగలు కొనుగోలు చేయాలనుకుంటున్న వారు భవిష్యత్తులో ధర పెరుగుతుందని భావించి ఇప్పటినుంచే ముందుగా ఆర్డర్లు ఇస్తున్నారని తెలిపారు. ధరలు పెరుగుతున్నా విక్రయాలు మామూలుగానే సాగుతున్నట్టు వెల్లడించారు.



బస్సుకు జెండా ఊపుతున్న ఎమ్మెల్యే గోవిందరాజన్

తిరుపతికి బస్సు సర్వీసు ప్రారంభం

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: చెన్నై మాధవరం నుంచి గుమ్మిడిపూండి మీదుగా తిరుపతికి బస్సులు నడపాలని ప్రయాణికులు ఏళ్లుగా కోరుతున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యే గోవిందరాజన్ చొరవ తీసుకున్నారు. ఆ మేరకు బస్సు సర్వీస్‌ను ఆయన గుమ్మిడిపూండిలో మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా డీఎంకే కోశాధికారి రమేష్, యూనియన్ కార్యదర్శి మణి బాలన్, పట్టణ కార్యదర్శి అరివళగన్ పాల్గొన్నారు.

ఆమ్నీ బస్సుల్లో రెండింతలు పెరిగిన ఛార్జీలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దీపావళికి చెన్నై నుంచి సుమారు 10 లక్షల మంది సొంతూర్లకు వెళ్లనున్నట్లు సమాచారం. ఇందుకు తగ్గట్లు రవాణాశాఖ అదనపు బస్సులను ఏర్పాటు చేస్తోంది. 28 నుంచి 30వ తేదీ వరకు చెన్నై నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు 11,200 ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపనున్నారు. ఇందుకుగాను రిజర్వేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ క్రమంలో ఎప్పటిలానే ఈ ఏడాది కూడా ఆమ్నీ బస్సుల్లో ఛార్జీలను రెండింతలు పెంచేశారు. చెన్నై నుంచి నాగర్‌కోవిల్‌కు సాధారణ రోజుల్లో రూ. 585 నుంచి రూ. 1,200 వరకు ఛార్జీలు వసూలు చేసేవారు. అయితే 29వ తేదీ నుంచి రూ. 2,110 నుంచి రూ. 4,350 వరకు వసూలు చేయనున్నారు. అలానే కోవైకు రూ. 800 నుంచి రూ. 1,040 వరకు ఛార్జీలు ఉండగా 29 నుంచి రూ. 1,800 నుంచి రూ. 3,470 వరకు నిర్ణయించారు. మదురై, తిరుచ్చి, ఈరోడ్, సేలం, దిండుక్కల్ తదితర అన్ని నగరాలకు సాధారణం కంటే మూడింతలు అధికంగా ఛార్జీలు పెంచేశారు.

ఉచితంగా జర్మన్ భాషా తరగతులు

వడపళని, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నర్సింగ్ వృత్తిలో ఉన్న వారికోసం ఉచితంగా జర్మన్ భాష తరగతులను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ మేరకు ఆరోగ్య విభాగానికి చెందిన 'తమిళనాడు అపెక్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్' (టీఎన్ఏఎస్‌డీసీ).. 'నాన్ ముదలవన్ ఫినిషింగ్ స్కూల్' (ఎన్ఎంఎఫ్ఎస్) పథకంలో కోర్సును అందిస్తున్నట్టు ఓ ప్రకటనలో తెలిపింది. జర్మనీలోని వైద్య రంగంలో సేవలందించేందుకు కోర్సు చాలా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంది. జర్మనీలో నైపుణ్యం లేనివారు 1.7 మిలియన్ల మంది ఉన్నారని, ఏడాదికి 35వేల నర్సింగ్ ఉద్యోగాలు ఖాళీ అవుతున్నాయని వివరించింది. ఎనిమిది నెలలపాటు ఉచితంగా కోర్సు ఉంటుందని తెలిపింది. జర్మనీ భాషలో బీ2 స్థాయిలో నేర్చుకోగలరని, ఈ నెల 25వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని, తరగతులు నవంబరు 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించింది. చెన్నై, తిరుచ్చి, కోయంబత్తూరు, మదురైలో ఆఫ్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తారని, రోజుకు ఎనిమిది గంటల చొప్పున వారంలో అయిదు రోజులపాటు బోధన ఉంటుందని, బస వసతి కూడా ఉందని పేర్కొంది.

అభివృద్ధి పనులకు 'సీహెచ్‌పీఏ' పలు ఒప్పందాలు



డీన్ తేరనిరాజన్‌కు చెక్కు అందిస్తున్న సునీల్ పాలీవాల్

వడపళని, న్యూస్‌టుడే: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో పలు రకాల అభివృద్ధి పనులకోసం చెన్నై పోర్ట్ అథారిటీ (సీహెచ్‌పీఏ) రూ. 2.79 కోట్లతో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 2.79 కోట్లతో పనులు జరపనున్నట్టు సీహెచ్‌పీఏ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. చెన్నై మహానగర కార్పొరేషన్‌తో కలిసి కార్పొరేట్ బాలికల మహోన్నత పాఠశాలలో కొత్తగా తరగతి గదులు, మద్రాస్ మెడికల్ కళాశాలలో ప్రత్యేక లెక్చర్ హాలు, మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ పోలీసు విభాగానికి సూచిక బోర్డులు, జిల్లా కలెక్టరుతో కలిసి అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి, వివేకానంద కల్చరల్ సెంటర్‌లో కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ సాహిత్యాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు పలు ప్రాజెక్టులు చేపట్టనున్నట్టు వివరించింది. మద్రాస్ మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ తేరనిరాజన్, అసిస్టెంట్ పోలీసు కమిషనర్ భాస్కర్, వివేకానంద కల్చర్ సెంటర్ ఉన్నత ప్రతినిధి మహేష్ మహరాజ్‌తో సీహెచ్‌పీఏ ఛైర్మన్ సునీల్ పాలీవాల్ మంగళవారం ఒప్పందాలు కుదుర్చుకుని చెక్కులందజేశారు.

నేడు, రేపు పలు రైళ్ల రద్దు

వడపళని, న్యూస్‌టుడే: 'దానా' తుపాను కారణంగా పలు రైళ్లు రద్దయినట్టు దక్షిణ రైల్వే మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

* **12841** షాలిమార్ - చెన్నై సెంట్రల్ 15.20 రైలు 24న, **12839** హావ్‌డా - చెన్నై సెంట్రల్ 23.55 రైలు 24, **06090** సంత్రాగచ్చి - చెన్నై సెంట్రల్ 23.40 రైలు 24, **12840** చెన్నై సెంట్రల్ - హావ్‌డా 19.00 రైలు 23, **22826** చెన్నై సెంట్రల్ - షాలిమార్ 19.50 రైలు 23, **12868** పుదుచ్చేరి - హావ్‌డా 14.15 రైలు 23, **12509** ఎస్ఎంవీటీ బెంగళూరు - గువాహటి వయా జోలార్‌పేట, కాట్పాడి, అరక్కోణం, పెరంబూరు 23.40 రైలు 23, **12842** చెన్నై సెంట్రల్ - హావ్‌డా కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ 07.00 రైలు 24, **22808** చెన్నై సెంట్రల్ - సంత్రాగచ్చి 08.10 రైలు 24, **06095** తాంబరం - సంత్రాగచ్చి 13.00 రైలు 24, **06089** చెన్నై సెంట్రల్ - సంత్రాగచ్చి 13.30 రైలు 23 తేదీల్లో రద్దయ్యాయి.

టీవీకే మహానాడుకు ఏర్పాట్లు దాదాపు పూర్తి





▸ వేదిక నిర్మిస్తున్నవారికి సూచనలిస్తున్న బుస్సీ ఆనంద్ ▸ కోయంబత్తూరులో అంటించిన పోస్టర్లు

వేళచ్చేరి: ప్రముఖ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) మొదటి రాష్ట్ర మహానాడు ఈనెల 27వ తేదీ విళుపురం జిల్లా విక్రవాండి సమీపంలోని వి.సాలై ప్రాంతంలో సుమారు 85 ఎకరాల విస్తీర్ణంలో జరుగనుంది. ఇందుకోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాంగణంలో సుమారు 15 వేలకు పైగా హైమాస్ట్ దీపాలు, 700 సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రవేశ మార్గంలో జార్జ్ కోట ఆకారంలో తీర్చిదిద్దుతున్నారు. అధ్యక్షుడు విజయ్, ఇతర ప్రముఖులు మహానాడు ప్రాంగణానికి రావడానికి వీలుగా తారు రోడ్డును నిర్మించారు. సుమారు 75 వేల కుర్చీలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం 80 శాతం పనులు పూర్తయినట్లు నిర్వాహకులు తెలిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమం ముగిసేవరకు వర్షం పడకూడదని అక్కడ ప్రత్యేక యాగం నిర్వహించినట్లు సమాచారం.

కోవైలో పోస్టర్లు.. కోయంబత్తూరు: కోవైలో మంగళవారం మహానాడుకు సంబంధించిన పోస్టర్లు వెలిశాయి. విజయ్ ఓ చిత్రంలో చెప్పే 'వాత్తి కమింగ్' (నాయకుడు వస్తాడు) డైలాగ్, ఆగ్లంలో పెద్ద అక్షరాలతో భావి సీఎం అర్థానిచ్చే విధంగా వాక్యాలు పోస్టర్లపై ఉన్నాయి.

బోగీలో పనిచేయని ఏసీ.. గొలుసు లాగిన ప్రయాణికులు

వడపళని, న్యూస్‌టుడే: చేరన్ ఎక్స్‌ప్రెస్ రైలు రెండో తరగతి ఏసీ బోగీలో ఏసీ పని చేయకపోవడంతో విసుగు చెందిన ప్రయాణికులు గొలుసు లాగి రైలును ఆపారు. సోమవారం రాత్రి 10 గంటలకు చెన్నై సెంట్రల్ నుంచి కోయంబత్తూరు వెళ్లేందుకు సిద్ధమైన చేరన్ ఎక్స్‌ప్రెస్ రైలు గొలుసు లాగడంతో ఆగింది. రెండో తరగతి ఏసీ బోగీలో ఏసీ పని చేయడం లేదని చెప్పినా సిబ్బంది పట్టించుకోలేదని, విసుగు చెందిన సదరు బోగీలోని ప్రయాణికులు గొలుసు లాగినట్లు తెలిసింది. దీంతో అధికారులు సిబ్బందిని పిలిపించి ఏసీని సరి చేయించారు. మరమ్మతులు పూర్తయ్యాక రైలు గంట ఆలస్యంగా బయలుదేరింది.

సంగీత కళానిధి అవార్డు అందించడానికి స్టే విధించకూడదు

ప్యారిస్, న్యూస్‌టుడే: సంగీత కళానిధి ఎంఎస్ సుబ్బులక్ష్మి అవార్డును గాయకుడు టీఎం కృష్ణకు ఇవ్వకుండా స్టే విధించాలని దాఖలైన కేసును జరిమానాతో కొట్టివేయాలని ది హిందూ గ్రూపు మద్రాసు హైకోర్టులో తెలిపింది. ఎంఎస్ సుబ్బులక్ష్మి 2004లో కన్నుమూసిన తర్వాత జ్ఞాపకార్థంగా సంగీత కళానిధి ఎంఎస్ సుబ్బులక్ష్మి పేరుతో అవార్డు, రూ. లక్ష నగదును 2005 నుంచి మ్యూజిక్ అకాడమీ, ఆంగ్ల దినపత్రిక ది హిందూ కలిసి అందిస్తున్నాయి. 2024కి గాను గాయకుడు టీఎం కృష్ణకు అవార్డు అందించనున్నట్లు ఇదివరకే ప్రకటించారు. అందుకు వ్యతిరేకత తెలిపి ఎంఎస్ సుబ్బులక్ష్మి మనవడు శ్రీనివాసన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుబ్బులక్ష్మిని కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన టీఎం కృష్ణకు ఆ అవార్డు ఇవ్వకుండా నిషేధం విధించాలని కోరారు. పిటిషన్‌పై ఇది వరకే మ్యూజిక్ అకాడమీ తరపున జవాబు పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ది హిందూ గ్రూపు తరపున పిటిషన్ దాఖలైంది. అందులో.. ఎంఎస్ సుబ్బులక్ష్మి మనవడు ఎవరని తమకు తెలియదని, పిటిషన్ దాఖలుకు అతనికి ఎలాంటి హక్కులేదన్నారు. 20 ఏళ్లుగా ఇస్తున్న స్థితిలో ఈ ఏడాది అవార్డు అందించడానికి నిషేధం విధించకూడదని, ఆ పిటిషన్‌ను జరిమానాతో కొట్టివేయాలని కోరారు.

శుభ్రతా కార్మికులకు దీపావళి బోనస్ అందించాలి



జెండా ఎగురవేస్తున్న ముత్తరసన్. విలేకరులతో మాట్లాడుతూ..

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఒప్పంద శుభ్రతా కార్మికులను పర్మినెంట్ చేసి వారికి దీపావళి బోనస్ అందించాలని సీపీఐ కార్యదర్శి ముత్తరసన్ తెలిపారు. సీపీఐ సెంటినరీ టీచర్స్ వర్క్‌షాప్‌ని మంగళవారం తిరుచ్చి సెంట్రల్ బస్టాండ్ వద్ద ఉన్న ఓ ప్రైవేట్ హాల్‌లో సీపీఐ కార్యదర్శి ముత్తరసన్, జాతీయ కార్యదర్శి నారాయణ ప్రారంభించారు. అనంతరం ముత్తరసన్ విలేకరులతో మాట్లాడుతూ... 2025 డిసెంబర్ వరకు ఏడాదిపాటు సీపీఐ శతాబ్ది వేడుకలు జరుగుతాయని చెప్పారు. ఏడాది మొత్తం పలు సదస్సులు, బహిరంగసభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు జరుపుతామని తెలిపారు. డీఎంకే కూటమిలోని పార్టీలన్నీ బయటకు వచ్చేస్తాయని ఎడప్పాడి మాట్లాడటంలో నిజం లేదన్నారు. మొదట కాలిపోతున్న ఆయన పార్టీని చూసుకోవాలని సూచించారు.

నత్తనడకన ఆనకట్ట నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న ఆనకట్ట

పొన్నేరి, న్యూస్‌టుడే: చెన్నై నగర తాగునీటి అవసరాలు తీర్చేందుకు చేపట్టిన ఆనకట్ట నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. చెన్నైలో పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని మీంజూరు సమీప కాట్టూరు, తట్టమంజి చెరువులను కలుపుతూ ఆనకట్ట నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 62.34 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో 2020లో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పొన్నేరి సమీప లక్ష్మీపురంలోని చెక్‌డ్యాం పూర్తిగా నిండితే విడుదలయ్యే అదనపు జలాలు కాట్టూరు, తట్టమంజి చెరువులకు చేరుతాయి. ఈ చెరువుల ప్రస్తుత సామర్థ్యం 58.27 మిలియన్ ఘనపుటడుగులు. కొత్త ఆనకట్ట నిర్మితమైతే వీటి సామర్థ్యం 350 మిలియన్ ఘనపుటడుగులకు పెరుగుతుందని జలవనరులశాఖ అధికారులు తెలుపుతున్నారు. నాలుగేళ్లలో చెరువు గట్ల ఎత్తు పెంచి కొత్తగా పది షట్టర్లు నిర్మించామన్నారు. రెండు చెరువుల్లో 2.25 లక్షల ఘనపు మీటర్ల లోతుకు మట్టి తవ్వాల్సి ఉందని, అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. ఆనకట్ట నిర్మాణం పూర్తయితే 5805 ఎకరాలకు లబ్ధి చేకూరనుంది.

రైళ్లలో టపాసులు తీసుకెళ్లడానికి నిషేధం

ప్యారిస్, న్యూస్‌టుడే: రైళ్లలో టపాసులు తీసుకెళ్లకూడదని రైల్వే పోలీసులు హెచ్చరించారు. దీపావళి పండుగ సమీపిస్తున్నందున రైళ్లలో టపాసులు, తేలికగా మంటలు వచ్చే వస్తువులు తీసుకెళ్లడానికి రైల్వే పోలీసులు నిషేధం విధించారు. దీనిని ఉల్లంఘించి తీసుకెళ్లేవారిని అరెస్టు చేసి, జరిమానా విధిస్తారని, లేదంటే జైలు శిక్ష విధిస్తారని హెచ్చరించారు.

నేడు కొడైకెనాల్‌కు గవర్నర్ రాక

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్ జిల్లా కొడైకెనాల్‌లోని మదర్ థెరిస్సా మహిళా విశ్వవిద్యాలయం 31వ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి బుధవారం కొడైకెనాల్‌కు రానున్నారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో పాల్గొని తిరిగి సాయంత్రం 3 గంటలకు విమానం ద్వారా చెన్నైకు వెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ మంత్రి కోవి.చెళియన్, దిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ఉపకులపతి శాంతిశ్రీ ధూలిపూడి పండిట్ పాల్గొనున్నారు. గవర్నర్ రాక నిమిత్తం కొడైకెనాల్‌లో 66 యాంటీ నక్సల్ యూనిట్లతోపాటు 400 మందికిపైగా పోలీసులు భద్రతా విధుల్లో నిమగ్నమయ్యారు.

చిరుతను పట్టుకునేందుకు ఏర్పాట్లు



అమర్చిన కెమెరాలు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: ఝార్ఖండ్‌కు చెందిన హనీస్అన్సారీ తేయాకు తోట కార్మికుడు. ఇతను తన భార్య నసీరాఖాతూన్, కుమార్తె అప్సర్‌ఖాతూన్ (4)తో కోవై జిల్లా వాల్‌పారై సమీప ఉసిమలైమట్టంలోని తేయాకు ఎస్టేట్‌లో పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఓ చిరుత దాడి చేయడంతో అప్సర్‌ఖాతూన్ మృతి చెందింది. సమాచారం అందుకున్న రేంజర్ వెంకటేశన్ నేతృత్వంలోని సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకున్నారు. చిరుతను పట్టుకునేందుకు 6 ప్రాంతాల్లో కెమెరాలు, బోనులు మంగళవారం ఏర్పాటు చేశారు. చిరుత పట్టుపడే వరకు ఉసిమలైమట్టం తేయాకు ఎస్టేట్ మూసి ఉంటుందని వెంకటేశన్ తెలిపారు.


కళాశాలల గుర్తింపునకు మద్రాస్ వర్సిటీ కొత్త నిబంధనలు

వడపళని, న్యూస్‌టుడే: రానున్న విద్యా సంవత్సరంలో విద్యా సంస్థల గుర్తింపు కోసం మద్రాసు వర్సిటీ కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చింది. కళాశాలలు దరఖాస్తులు సమర్పించాలని వర్సిటీ నోటిఫికేషన్‌లో పేర్కొంది. రాష్ట్రంలో కొత్తగా వెలసిన ఆర్ట్స్, సైన్సు కళాశాలలకు కూడా ఈ నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. ఇప్పటికే నడుస్తున్న కళాశాలల్లో ఏవైనా కొత్త కోర్సులను ప్రారంభించాలనుకుంటే కూడా దరఖాస్తు చేసుకోవాలని, గత ఏడాది మాదిరిగా దరఖాస్తులు నిర్దేశించిన గడువులోగా సమర్పించకుండా, తేదీ తర్వాత దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిగణనలోకి తీసుకోమని, తిరస్కరిస్తామని వర్సిటీ స్పష్టం చేసింది. ఏఐసీటీఈ లేదా ఇతర ప్రభుత్వ సంస్థలకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ గుర్తింపు సాధ్యం కాదని చెప్పింది. వర్సిటీ అధికారులు కళాశాలలకు నేరుగా విచ్చేసి విద్యాసంస్థల ఆర్థిక స్థితిగతుల్ని, కళాశాలకు కావలసిన విధంగా భవన నిర్మాణం, ప్రయోగశాలలు, గ్రంథాలయం, వైద్య చికిత్సకు వసతులు వంటివి పరిశీలిస్తారని వివరించింది. దరఖాస్తు చేసుకునే కళాశాలలకు ఇతర విద్యా సంస్థలు ఎంత దూరంలో ఉన్నాయో కూడా తెలపాలని పేర్కొంది. కొత్తగా ప్రతిపాదించిన కళాశాలలకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా తెలియజేయాలని సూచించింది. బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల్లో కళాశాలలు నిబంధనలు సక్రమంగా పాటించాలని స్పష్టం చేసింది.

పోలీసులకు శిక్షణ ఇవ్వాలి: భాజపా

సైదాపేట, న్యూస్‌టుడే: పోలీసులు ప్రజలతో స్నేహితుల్లా మెలిగేందుకు రాష్ట్రవ్యాప్తంగా పోలీసులకు శిక్షణ ఇవ్వాలని తమిళనాడు భాజపా అధికార ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల పోలీసులు, మద్యం మత్తులో ఉన్న ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదం పోలీసు యంత్రాంగ పరువు, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉందన్నారు. కారకులకు కఠిన శిక్ష విధించాలని చెప్పారు. పోలీసులు కూడా ప్రజలను బెదిరించకూడదన్నారు.

చెట్ల కొమ్మలు తొలగింపు



గాంధీనగర్ 3వ మెయిన్ రోడ్డులో..

చెన్నై, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవన వర్షాల నేపథ్యంలో మహానగర చెన్నై కార్పొరేషన్ పరిధి ప్రాంతాల్లో నష్టాన్ని కలిగించే పరిస్థితుల్లో ఉన్న చెట్లకొమ్మలను ముందుగానే యంత్రాంగం తొలగిస్తోంది. అడయారు జోన్ 173వ డివిజన్‌లోని గాంధీనగర్ 3వ మెయిన్ రోడ్డు వెంబడి ఉన్న చెట్ల కొమ్మలను హైడ్రాలిక్ యంత్రం ద్వారా మంగళవారం తొలగించారు. మాధవరం జోన్ 28వ డివిజన్‌లోని పాండియన్ వీధి, 150వ డివిజన్ అరుణాచలం నగర్ తొలి వీధి, 157వ డివిజన్ రివర్ వ్యూ ఎన్‌క్లేవ్ గంగావీధి, తేనాంపేట జోన్ మెరినా బీచ్ పార్కులోని చెట్ల కొమ్మలను యంత్రాలు ద్వారా తొలగించారు.

యూట్యూబర్ ఇర్ఫాన్‌పై కేసు

ఆసుపత్రికి నోటీసు



ఇర్ఫాన్

మహాబలిపురం, న్యూస్‌టుడే: వివాదాస్పద వీడియో విడుదల చేసిన యూట్యూబర్ ఇర్ఫాన్‌పై కేసు నమోదైంది. ఆయన భార్య చెంగల్పట్టు జిల్లా షోలింగనల్లూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జులై 24న పాపకు జన్మనిచ్చింది. ప్రసవాన్ని చిత్రీకరించిన ఇర్ఫాన్ ఈనెల 19న తన యూట్యూబ్ ఛానెల్‌లో విడుదల చేశాడు. వీడియో తొలగించాలంటూ వైద్యశాఖ తరఫున లేఖ పంపారు. సదరు ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మెడికల్, రూరల్ సర్వీస్ డైరెక్టర్ డాక్టరు రాజమూర్తి మాట్లాడుతూ ఆపరేషన్ థియేటర్‌లోకి కెమెరాలతో వెళ్లి ఎలాంటి వైద్య శిక్షణలేని వ్యక్తి శిశువు బొడ్డుతాడు కోయడం సరికాదన్నారు. బొడ్డుతాడు కత్తిరించే సమయంలో తగిన భద్రతా విధానాలు పాటించలేదని, బిడ్డకు ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయమై ప్రైవేట్ ఆసుపత్రి మేనేజ్‌మెంట్‌కు, ఇర్ఫాన్‌కు నోటీసులు పంపామని, వివరణ సక్రమంగా లేకుంటే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు. అంతలోనే ఇర్ఫాన్ వివాదాస్పద వీడియోను తొలగించాడు. వైద్యశాఖ తరఫున ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆయనపై షోలింగనల్లూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

కారు బాంబు పేలుడు కేసులో మరో ముగ్గురి అరెస్టు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోవై ఉక్కడం కోట్టై ఈశ్వరన్ ఆలయం ఎదుట 2022 అక్టోబరు 23న కారులో బాంబు పేలడంతో జమేషా ముబీన్ అనే వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేపట్టి 15 మందిని గతంలో అరెస్టు చేశారు. తాజాగా హనీఫా, శరణ్‌మారియప్పన్, పర్వేస్ రెహ్మాన్ అనే వ్యక్తులను మంగళవారం అరెస్టు చేశారు.

మసీదు, హోటల్‌కు బాంబు బెదిరింపులు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై టీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌కి ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు సందేశం వచ్చింది. అప్రమత్తమైన హోటల్ యాజమాన్యం పోలీసులకి సమాచారం ఇచ్చింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బాంబు స్క్వాడ్ సాయంతో తనిఖీ చేశారు. అదేవిధంగా థౌజండ్‌లైట్‌లోని మసీదుకి కూడా ఇదేవిధంగా బెదిరింపులు రావడంతో పోలీసులు అక్కడ తనిఖీలు చేపట్టారు. పేలుడు వస్తువులు లభించలేదు. రెండు ఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.2.39 కోట్ల జీఎస్టీ చెల్లించాలి: శుభ్రతా కార్మికురాలికి నోటీసు



నోటీసు చూపుతున్న రాణి

వేలూరు, న్యూస్‌టుడే: ఆంబూరు సమీప కృష్ణమాపురం కామరాజర్‌నగర్‌కు చెందిన రాణి వితంతువు. ఈమె పెరియవరగంలోని ఓ తోళ్ల పరిశ్రమలో శుభ్రతా కార్మికురాలిగా పని చేస్తోంది. ఈనెల 19న జీఎస్టీ విభాగం నుంచి నోటీసు అందింది. తిరుచ్చిలో మార్డన్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ నిర్వహించడంతో రూ. 2.29 కోట్ల జీఎస్టీ బకాయి ఉందని నోటీసులో ఉంది. దీంతో విస్తుపోయిన రాణి ఆంబూర్ టౌన్ పోలీసుస్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టగా రాణి ఆధార్‌కార్డు, పాన్‌కార్డుల నెంబర్లతో ఎవరో పన్ను ఎగ్గొట్టినట్లు తేలింది. దర్యాప్తు కొనసాగుతోంది.

పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జుల నియామకం

తమిళనాడు భాజపా ఎన్నికల ఇన్‌ఛార్జులను అధిష్ఠానం నియమించింది. పార్టీ సంస్థాగత ఎన్నికలు నవంబరులో నిర్వహించనున్నారు. తమిళనాడు భాజపా ఎన్నికల ఇన్‌ఛార్జిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రవర్తి, సహ ఇన్‌ఛార్జిలుగా పార్టీ జాతీయ జనరల్ కమిటీ సభ్యుడు సెల్వకుమార్, రాష్ట్ర అధ్యక్షురాలు మీనాక్షి నిత్యాసుందర్, మదురై పెరుంకోట్ట బాధ్యుడు కదలి నరసింగమూర్తిలను నియమించారు. దిల్లీలో సోమవారం ఎన్నికల ఇన్‌ఛార్జిలకు శిక్షణ తరగతులు జరిగాయి. ఇందులో ఆ నలుగురూ పాల్గొన్నారు.

ఏపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు

చెన్నై, న్యూస్‌టుడే: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య పేరును మచిలీపట్నం వైద్య కళాశాలకు పెట్టేలా సోమవారం ఉత్తర్వులు జారీ చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ద్రావిడ దేశం వ్యవస్థాపక అధ్యక్షులు వి. కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన తన ప్రకటనలో... మరుగునపడ్డ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను నేటితరం తెలుసుకునేలా చర్యలు తీసుకోవడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు.





చిత్రబృందం విడుదల చేసిన పోస్టరు

బ్రదర్ పాట విడుదల నేడు

చెన్నై, న్యూస్‌టుడే: రాజేశ్ దర్శకత్వంలో జయం రవి, ప్రియాంక మోహన్ జంటగా నటించిన చిత్రం 'బ్రదర్'. స్క్రీన్ సీన్ మీడియా నిర్మించిన ఈ చిత్రానికి హారిస్ జయరాజ్ సంగీతం సమకూర్చారు. శరణ్య పొన్‌వణ్ణన్, భూమిక, వీటీవీ గణేశ్, సీత, నట్టి తదితరులు ఇతర తారాగణం. చిత్రానికి సెన్సార్ బోర్డు 'యు' ధ్రువపత్రం అందించింది. చిత్రం నిడివి 2.20 గంటలు. రానున్న 31న చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో చిత్రంలోని 'మెదక్కుదు కాలు రెండుం' పాటను బుధవారం సాయంత్రం 5 గంటలకు విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం ప్రకటించింది. దీనికి సంబంధించిన ప్రకటనను పెళ్లి శుభ లేఖ తరహాలో డిజైన్ చేసిన పోస్టరు ద్వారా వెల్లడించింది.

అమరన్ ట్రైలర్...



చెన్నై: దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో శివ కార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'అమరన్'. కమల్‌హాసన్‌కు చెందిన రాజ్‌కమల్ ప్రొడక్షన్ నిర్మించిన ఈ చిత్రం రానున్న 31న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రం ట్రైలర్‌ను బుధవారం సాయంత్రం 6 గంటలకు విడుదల చేయనున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. దీనికి సంబంధించిన పోస్టరునూ విడుదల చేసింది.



శింబు తదుపరి చిత్రంపై ప్రకటన

చెన్నై: నటుడు శింబు 'ఎక్స్' పేజీ ద్వారా తన తదుపరి చిత్రం గురించి ప్రకటన చేశారు. అందులో... 2000లల్లో నటించిన 'ధమ్', 'మన్మథన్', 'వల్లవన్', 'విన్నైతాండి వరువాయా' చిత్రాలను కలిపి జెన్ సి మోడ్‌లో తన తర్వాతి చిత్రం ఉంటోందని తెలిపారు. ఈ చిత్రాన్ని ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోందని, అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించనున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన పోస్టరు శింబు అభిమానులను ఆకర్షిస్తోంది. ప్రస్తుతం ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపొందుతున్న 'డ్రాగన్' పనులు పూర్తిగా ముగిసిన తర్వాత శింబు చిత్రం చిత్రీకరణ పనులు ప్రారంభంకానున్నాయని చిత్రబృందం వెల్లడించింది. చిత్రం టైటిల్, నటీనటులు, సాంకేతిక కళాకారుల గురించి ప్రకటన త్వరలో వెల్లడించనున్నట్టు పేర్కొంది.



'మెయ్యళగన్'లో ఓ సన్నివేశం

ఓటీటీల్లోకి వచ్చిన చిత్రాలు

చెన్నై, న్యూస్‌టుడే: ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో కార్తి, అరవిందస్వామి ప్రధాన పాత్రలు పోషించిన 'మెయ్యళగన్' సెప్టెంబరు 27న విడుదలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రానున్న 27న తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం, హిందీ భాషల్లో నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫారంపై చిత్రం విడుదల కానుంది. తమిళరసన్ పచ్చముత్తు దర్శకత్వంలో అట్టకత్తి దినేశ్, హరీశ్ కల్యాణ్ ప్రధాన పాత్రల్లో నటించిన 'లబ్బర్ పందు' థియేటర్లలో విడుదలైన నేపథ్యంలో రానున్న 31న డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో విడుదల కానుంది.

కార్మికుల సమ్మెతో రూ.840 కోట్ల నష్టం

హైకోర్టులో తెలిపిన సామ్‌సంగ్

ప్యారిస్, న్యూస్‌టుడే: కార్మికుల నిరవధిక సమ్మె కారణంగా రూ. 840 కోట్లు నష్టం ఏర్పడినట్లు సామ్‌సంగ్ కంపెనీ హైకోర్టులో తెలిపింది. శ్రీపెరంబుదూర్‌లోని కంపెనీలో పనిచేసే కార్మికులు, సీఐటీయూకు అనుబంధంగా సాంసంగ్ ఇండియా కార్మిక సంఘం పేరిట సంఘాన్ని రిజిస్టర్ చేయాలంటూ రిజిస్ట్రార్‌కు, కార్మిక సంక్షేమశాఖ డిప్యూటీ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. చర్యలు చేపట్టకపోవడంతో సంఘం తరపున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కిందటిసారి విచారణకు వచ్చినప్పుడు ప్రభుత్వం తరపున... సాంసంగ్ కంపెనీ పేరుతో కార్మిక సంఘాన్ని ప్రారంభించడానికి కంపెనీ వ్యతిరేకత తెలిపిందని, ఈ విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పిటిషన్ మంగళవారం మళ్లీ విచారణకు వచ్చింది. సాంసంగ్ తరపున .. తమ సంస్థలో రాజకీయ జోక్యం ఉండకూడదని, సంస్థ పేరుతో కార్మిక సంఘాన్ని ప్రారంభించడం ప్రాథమిక హక్కు కాదన్నారు. కార్మికుల సమ్మె కారణంగా రూ.840 కోట్ల నష్టం ఏర్పడిందని, సంస్థ పేరు ఉపయోగించకుండా కార్మికసంఘాన్ని ప్రారంభించవచ్చని, తమను ఈ కేసులో చేర్చుకోవాలని తెలిపారు. అన్ని తరపున వాదనలు విన్న న్యాయమూర్తి సాంసంగ్ మధ్యంతర పిటిషన్‌ను ఆమోదించి, తదుపరి విచారణ నవంబరు 11కి వాయిదా వేశారు.



చీరలు పరిశీలిస్తున్న మంత్రి గాంధీ

దీపావళి వస్త్ర విక్రయాలు ప్రారంభం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఎగ్మూరులోని కో-ఆప్‌టెక్స్ తిల్లైయాడి వళ్లియమ్మై విక్రయ కేంద్రంలో చేనేత, జౌళి శాఖ మంత్రి ఆర్ గాంధీ మంగళవారం దీపావళి వస్త్ర విక్రయాలను ప్రారంభించారు. కొత్త రకాలను పరిచయం చేసి పరిశీలించారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి అముదవల్లి, చేనేత శాఖ సంచాలకుడు షణ్ముగసుందరం, ఇలా లలిత, కో-ఆప్‌టెక్స్ ఎండీ దీపక్ జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన వడాయతీ ఉత్సవాలు



ప్యారిస్, న్యూస్‌టుడే: జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 14 నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన వడాయతీ ఉత్సవాలు మంగళవారంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి త్రికాల అభిషేకాలు, అలంకరణలు, ఆరాధనలు చేశారు. సాయంత్రం మూలమూర్తిని బంగారు కేడియంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన శ్రీ లలితా సహస్రనామ బృంద సభ్యుల పారాయణం భక్తిభావాన్ని పెంచింది. మంగళవారం ఉత్సవానికి టీకేకేవీఎన్‌ఎన్ వైశ్య ఛారిటీస్ ఉభయకర్తగా వ్యవహరించింది. పాలకమండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అలంకరణలో కన్యకా పరమేశ్వరి



జైనగర్‌లో పనులు పరిశీలిస్తున్న మేయర్

వాననీటి కాలువ పనుల పరిశీలన

చెన్నై, న్యూస్‌టుడే: కోడంబాక్కం జోన్‌లో జరుగుతున్న వాననీటి పారుదల కాలువ పనులను మంగళవారం మహానగర చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ పరిశీలించారు. 127వ డివిజన్‌లోని శ్రీనివాసన్‌నగర్, 128వ డివిజన్‌లోని సాధిక్ బాషానగర్, సంజయ్‌గాంధీ కాలనీ ప్రాంతాల్లో జరుగుతున్న కాలువల పునర్నిర్మాణ పనులు, 129వ డివిజన్‌లోని పెరియార్ వీధిలో రూ.14లక్షల వ్యయంతో జరుగుతున్న వాననీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. 127వ డివిజన్‌లోని జైనగర్, 129వ డివిజన్‌లోని మజీద్ నగర్‌లో ప్రస్తుతం కురిసిన వర్షాలకు నిలిచిన వాననీటి తొలగింపు పనులను పరిశీలించారు. అదనపు మోటారు పంపులతో వాననీటిని వీలైనంత త్వరగా తొలగించాలని అధికారులకు సూచించారు. విరుగంబాక్కం కాలువలో వాననీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న గుర్రపు డెక్క తొలగించే పనులను పరిశీలించారు. వెంట విరుగంబాక్కం ఎమ్మెల్యే ప్రభాకర్‌రాజా, మధ్య ప్రాంతీయ డిప్యూటీ కమిషనర్ ప్రవీణ్ కుమార్, జోనల్ కమిటీ అధ్యక్షులు కృష్ణమూర్తి, కౌన్సిలర్లు లోగు, స్టెల్లా జాస్మిన్ రత్న, రవిశంకర్, అధికారులు ఉన్నారు.

ఆంధ్రా ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన ఏటీఎఫ్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్ణయాన్ని అఖిల భారత తెలుగు సమాఖ్య స్వాగతించింది. మచిలీపట్నంలోని కొత్త వైద్య కళాశాలకు స్వాతంత్య్ర సమరయోధుడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య పేరు పెట్టడం సంతోషకరమని అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మచిలీపట్నం సమీపంలోని భట్లపెనుమర్రులో జన్మించిన పింగళి వెంకయ్య అధ్యాపకుడు, రచయిత, విద్యావేత్త, భూగర్భ శాస్త్రవేత్త, వ్యవసాయవేత్త ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

ఉదయనిధికి ఆహ్వానం

చెన్నై, న్యూస్‌టుడే: తాను రాసిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలంటూ డీఎంకే యువజన విభాగం కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిని మంత్రి పొన్ముడి ఆహ్వానించారు. పొన్ముడి రాసిన 'ద్రావిడ ఇయక్కముం, కరుప్పర్ ఇయక్కముం' పుస్తకావిష్కరణ తేనాంపేటలోని అన్నా అరివాలయంలో 25న జరగనుంది. ఉదయనిధిని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం పొన్ముడి కలిశారు.



పుస్తకావిష్కరణ ఆహ్వానపత్రిక అందిస్తున్న పొన్ముడి

న్యాయవ్యవస్థను సవాల్ చేస్తున్న నిత్యానంద

మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: నిత్యానంద పరారీలో ఉంటూ భారత న్యాయవ్యవస్థను సవాలు చేస్తున్నారని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం తెలిపింది. కర్ణాటకకు చెందిన సురేఖ నిత్యానంద శిష్యురాలు. ఆమె మదురై ధర్మాసనంలో దాఖలు చేసిన పిటిషన్‌లో.. గణేశన్ అనే వ్యక్తికి చెందిన విరుదునగర్‌లోని 45 ఎకరాల స్థలాన్ని నిత్యానంద సూచనల మేరకు ఆక్రమించుకోవడానికి యత్నించినట్లు తనతోపాటు ధర్మలింగం, రవి తదితరులపై తేని పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపింది. ఎలాంటి ఆక్రమణలకు యత్నించలేదని, అబద్ధపు ఫిర్యాదుతో కేసు నమోదైందని, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరింది. ఈ పిటిషన్ జస్టిస్ భరతచక్రవర్తి ఎదుట మంగళవారం విచారణకు వచ్చింది. గణేశన్ తరపున హాజరైన లాయర్ .. స్థల యజమాని గణేశన్ ఇదివరకే నిత్యానంద కేసులో ప్రభుత్వ తరపు సాక్షిగా ఉన్నాడని, మైసూర్ రామ్‌నగర్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని, నిత్యానంద శిష్యులు ఆయన్ను భయపెట్టేందుకు అవకాశం ఉందని ముందస్తు బెయిల్ ఇవ్వకూడదని తెలిపారు. న్యాయమూర్తి... నిత్యానందపై పలు కేసులు, అరెస్టు వారెంట్‌లు ఉన్న కోర్టుల్లో హాజరవడం లేదన్నారు. పిటిషనర్ ఇకపై ఇలాంటి వ్యవహారాల్లో జోక్యం చేసుకోనని హామీపత్రం దాఖలు చేస్తే ముందస్తు బెయిల్‌పై ఉత్తర్వు జారీ చేస్తామని తెలిపి విచారణ బుధవారానికి వాయిదా వేశారు.



నమూనా చెక్కు అందిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

సంక్షేమ సాయం పంపిణీ

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్ నామక్కల్ జిల్లా బొమ్మైకుట్టై మేట్టులో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యక్రమంలో 16,031 మంది లబ్ధిదారులకు రూ. 146.56 కోట్ల విలువైన ప్రభుత్వ సంక్షేమ సహాయకాలు పంపిణీ చేశారు. మంత్రులు, అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలు అందజేశారు.

డీఎంకే కూటమిలో చీలికకు అవకాశం: ఈపీఎస్

టీనగర్, న్యూస్‌టుడే: అధికార కూటమిలోని పార్టీలు డీఎంకేపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయని, దీంతో చీలికలు ఏర్పడే అవకాశం ఉందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి ఆరోపించారు. సోమవారం సేలం జిల్లా కొంకనాపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. డీఎంకే కూటమిలోని కమ్యూనిస్ట్, వీసీకే తదితర పార్టీలు తమ డిమాండ్లు నెరవేరని కారణంగా డీఎంకేపై అసంతృప్తిగా ఉన్నట్లు తెలిపారు. త్వరలో ఆ పార్టీలు కూటమి నుంచి వైదొలగే అవకాశముందన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే బలమైన కూటమి ఏర్పాటు చేస్తుందన్నారు.

కాషాయమయాన్ని ఖండించిన సెల్వ పెరుంతగై

చెన్నై, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు కాషాయరంగు పులమడాన్ని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై ఖండించారు. ఆయన తన ప్రకటనలో... కేంద్రంలోని భాజపా సర్కారు ఇప్పటికే వందేభారత్ రైలు, డీడీ న్యూస్ టీవీ ఛానెల్ లోగో రంగును కాషాయం చేసిందన్నారు. ఆ కోవలో ప్రస్తుతం బీఎస్‌ఎన్‌ఎల్ లోగోనూ కాషాయం చేసిందని, ఇది తీవ్రంగా ఖండించదగిందన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్‌ను ప్రైవేటురంగం కన్నా ఎక్కువ లాభాలు గడించే సంస్థగా మార్చలేని మోదీ సర్కారు దానిని కాషాయమయం చేయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఇది ప్రజల భావోద్వేగాలకు వ్యతిరేకమని, రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొన్నారు.



విజేత జట్టు

జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో అటవీశాఖ జట్టుకు స్వర్ణం

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడు అటవీశాఖకు చెందిన కబడ్డీ జట్టు మూడోసారి స్వర్ణ పతకం సాధించింది. భారత అటవీశాఖ తరపున ఛత్తీస్‌ఘడ్‌లో 27వ జాతీయ స్థాయి పోటీలు ఇటీవల జరిగాయి. ఇందులో తమిళనాడు అటవీశాఖ తరపున కబడ్డీ, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, అథ్లెటిక్ తదితర 16 జట్లు పాల్గొన్నాయి. కబడ్డీ జట్టు మూడోసారి స్వర్ణ పతకం సాధించింది.



క్రీడాకారిణికి రేసింగ్ సైకిల్ అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్

క్రీడాకారులకు చేయూత

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడు ఛాంపియన్స్ ట్రస్టు ద్వారా క్రీడాకారులకు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ రూ.1,00,36,312 విలువైన సహాయకాలను మంగళవారం అందించారు. థాయ్‌ల్యాండ్‌లో డిసెంబరు 1 నుంచి 7 వరకు జరగనున్న వరల్డ్ స్కిల్ యూత్ స్పోర్ట్స్ పోటీల్లో పాల్గొనే 7 మంది క్రీడాకారులకు తలా రూ.1,67,700 చొప్పున చెక్కులు ఇచ్చారు. తమిళనాడు సైక్లింగ్ క్రీడాకారులు 5 మందికి తలా రూ.16,66,646 విలువైన రేసింగ్ సైకిళ్లు పంపిణీ చేశారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంక్షేమ, క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ కార్యదర్శి అతుల్య మిశ్ర, తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ సభ్య కార్యదర్శి మేఘనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్లతో పోటీ ప్రభుత్వం నడుపుతున్న కేంద్రం

కె.బాలకృష్ణన్



వేళచ్చేరి, న్యూస్‌టుడే: గవర్నర్లను ఉపయోగించి కేంద్రం తమిళనాడు సహా 10 భాజపాయేతర రాష్ట్రాల్లో పోటీ ప్రభుత్వాన్ని నడుపుతోందని సీపీఎం రాష్ట్ర అధ్యక్షుడు కె.బాలకృష్ణన్ ఆరోపించారు. మైలాడుదురై కోర్టు రోడ్డులో పార్టీ కార్యాలయానికి కొత్తగా నిర్మించిన భవన ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెన్నైలో కురిసిన భారీ వర్షాలకు ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు తగిన చర్యలు తీసుకున్నారని ప్రశంసించారు. వైపరీత్యాల సమయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై పక్షపాతం చూపుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం కోరే సాయాన్ని కేంద్రం అందించాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ఆర్‌ఎన్ రవి తమిళ సంస్కృతి, తమిళనాడుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, ఆయనపై పలుమార్లు నిరసనలు వెల్లువెత్తినా తీరును మార్చుకోలేదన్నారు.

డీఎంకే పాలనలో పోలీసులకు రక్షణ కరవు

మాజీ మంత్రి జయకుమార్

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: డీఎంకే పాలనలో పోలీసులకు రక్షణ కరవైందని అన్నాడీఎంకే మాజీ మంత్రి జయకుమార్ ఆరోపించారు. ఆయన తిరువళ్లూరులో మంగళవారం జరిగిన పార్టీ కార్యకర్త వివాహంలో పాల్గొన్న అనంతరం విలేకరులతో మాట్లాడారు. చెన్నై బీచ్‌లో ఓ జంట మద్యం మత్తులో పోలీసులను దుర్భాషలాడటం దురదృష్టకరమన్నారు. ఓ పాలకపక్ష నేత పేరు చెప్పి బెదిరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయనడానికి ఈ ఘటన నిదర్శనమని విమర్శించారు. పోలీసుశాఖలో రాజకీయ జోక్యం చోటుచేసుకుంటే పోలీసులు తమ విధులను సరిగా నిర్వహించలేరనే విషయాన్ని పాలకపక్ష నేతలు గ్రహించాలని సూచించారు.

ప్రైవేటు బస్సులను అద్దెకు తీసుకోవడం దేనికి సంకేతం?

అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: దీపావళికి ప్రైవేటు బస్సులను అద్దెకు తీసుకోవడం ప్రైవేటీకరణేనని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ తెలిపారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... దీపావళికి సొంతూర్లకు వెళ్లేవారి సౌకర్యార్థం ప్రైవేటు బస్సులను అద్దెకు తీసుకుని నడిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రవాణా శాఖ మంత్రి తెలిపారన్నారు. ప్రజల కోసమని సాకు చెబుతూ ప్రైవేటు బస్సులను ప్రభుత్వం నడపడం ఆమోదయోగ్యం కాదని చెప్పారు. ప్రభుత్వ రవాణా సంస్థల్లో సుమారు 25 వేల ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేయకుండా చాలా తక్కువగా ఒప్పంద సిబ్బందిని నియమించారని తెలిపారు. ఇవన్నీ చూస్తుంటే ప్రభుత్వ రవాణా సంస్థను ప్రైవేటీకరణ చేసేవిధంగా కనిపిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే కొత్త బస్సులు కొనుగోలు చేసి, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి సహకార దుకాణాల్లో బాణసంచా విక్రయాలు ప్రారంభం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: సహకార శాఖ తరపున దీపావళి పండుగను పురస్కరించుకొని తాత్కాలిక బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటిలో బుధవారం నుంచి విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఇక్కడ తక్కువ ధరకు దొరకనున్నాయి. చెన్నైలో టీయూసీఎస్ తరపున తేనాంపేట కామధేను ప్రాంగణం, అడయారు, బెసెంట్‌నగర్, వేలచ్చేరి, సాలిగ్రామం, ఆర్‌ఏ పురం, ట్రిప్లికేన్, పెరియార్ నగర్, విల్లివాక్కం తదితర 9 ప్రాంతాలలో దుకాణాలు ఏర్పాటయ్యాయి. కాంచీపురం వినియోగదారుల సహకార టోకు విక్రయ దుకాణం తరపున పల్లావరం, క్రోంపేట, ఈస్ట్ తాంబరం, వెస్ట్ తాంబరం షణ్ముగం రోడ్డు, చెంబాక్కం, ఆలందూర్, చెంగల్పట్టు, పోరూర్, కాంచీపురంలో నెలకొల్పారు. ఈ దుకాణాలలో అవకతవకలు చోటుచేసుకోకుండా విక్రయాలను కంప్యూటర్‌లో నమోదు చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని సహకార సంఘాల రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ 25న

విల్లివాక్కం, న్యూస్‌టుడే: గిండి సిప్‌కాట్ కళాశాల ఎదురుగా ఉన్న తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ సమాచార, శిక్షణ కేంద్రంలో ఈ నెల 24వ తేదీ సేంద్రియ ఎరువు తయారీ, వానపాముల పెంపకం, పంటల వ్యర్థాలు, ఫాం వ్యర్థాల సేకరణ తదితర వాటిపై శిక్షణ ఇవ్వనున్నారు. 25వ తేదీ పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఉంటుంది. ప్రతి శిక్షణకు రూ.1,000 ఫీజు చెల్లించాలి. ఆసక్తి ఉన్నవారు 044-2953 0048 అనే ఫోన్‌నెంబరు ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని వర్సిటీ శిక్షణ కేంద్ర ఛైర్మన్ అశోక్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం వెల్లడి

చెన్నై, న్యూస్‌టుడే: సేలం జిల్లా వీరకల్ గ్రామంలోని కొత్తికుట్టై చెరువులో ఆదివారం నీటమునిగి ఒకే కుటుంబానికి చెందిన శివనందిని(20), శివగిరి(10), మునుసామి కుమార్తె దివ్యదర్శిని(14) మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ విచారం వ్యక్తం చేశారు. ఆ కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున సీఎం పబ్లిక్ రిలీఫ్ ఫండ్ నుంచి అందించాలని ఆదేశించారు.

దిండుక్కల్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అనిశా సోదాలు

ఆర్కేనగర, న్యూస్‌టుడే: దిండుక్కల్ జిల్లా వత్తలగుండు రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచాలు తీసుకుంటున్నట్లు అందిన సమాచారం మేరకు జిల్లా అవినీతి నిరోధకశాఖ అధికారులు సోమవారం కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సిబ్బంది నుంచి లెక్కల్లో చూపని రూ.82,900 స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ దురైసామి, సిబ్బంది వద్ద సోమవారం అర్ధరాత్రి వరకు దర్యాప్తు జరిపారు. అదేవిధంగా కార్యాలయంలో ముఖ్య పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

బస్సు ఢీకొని రౌడీషీటర్ మృతి

మహాబలిపురం: చెంగల్పట్టు జిల్లా గూడువాంజేరి పురపాలక సంఘం పరిధిలోని పెరియార్‌నగర్‌కు చెందిన జగదీశన్ కుమారుడు భూమినాథన్ (24) ప్రముఖ రౌడీషీటర్. ఇతను పెయింటర్. సోమవారం పనికి వెళ్లి రాత్రి గూడువాంజేరికి రైలులో చేరుకున్నాడు. అక్కడ రోడ్డు దాటుతుండగా హస్తినాపురం నుంచి చెంగల్పట్టు వెళుతున్న ప్రభుత్వ బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. తాంబరం ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు జరుపుతున్నారు.

మద్యం మత్తులో స్నేహితుడి హత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో తన భార్య గురించి తప్పుగా మాట్లాడిన స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు... తిరుప్పూర్ జిల్లా కాశీపాళ్యానికి చెందిన కార్తి (40) అదే ప్రాంతంలో మాంసం దుకాణం నడుపుతున్నాడు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి తన స్నేహితుడు ముత్తురాజా (39)తో కలిసి నల్లూర్ ఎంజీఆర్ నగర్‌లోని వడివేల్ అనేవ్యక్తి ఇంటికి వెళ్లి మద్యం తాగారు. ఆ సమయంలో ముత్తురాజా భార్య గురించి కార్తి తప్పుగా మాట్లాడినట్లు తెలుస్తోంది. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆక్రోశంతో ముత్తురాజా కత్తితో కార్తిపై దాడిచేసి హతమార్చాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి కాలేదని బస్సు కిందపడి యువకుడి ఆత్మహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వివాహం కాలేదన్న బాధతో ఓ యువకుడు బస్సు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగపట్నంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నాగపట్నం జిల్లా ధర్మనాథపురం ప్రాంతానికి చెందిన అరవింద్‌సామి (30) ఐదు నెలలుగా పుదుచ్చేరిలోని మేట్టుపాళ్యం ప్రాంతంలో ఉంటూ వాహనాలు రిపేర్ పనులు చేస్తున్నాడు. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం మేట్టుపాళ్యం తొలిర్‌పేట్టై ప్రాంతంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తూ ఉన్నట్టుండి ఎదురుగా వచ్చిన ప్రైవేట్ బస్సు కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు. మృతుడు తనకు వివాహం కావడంలేదని గత కొన్నిరోజులుగా తోటి కార్మికులతో చెప్పి బాధపడుతున్నాడని, ఆ కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు.

వృద్ధుడిని చంపిన నిందితుడి అరెస్ట్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్ జిల్లా కుజిలింపారైకు చెందిన రంగసామి (72) కార్మికుడు. ఇతని భార్య చనిపోయింది. ఇతనికి ఇద్దరు కుమారులు. వారికి వివాహాలై కోయంబత్తూర్‌లో నివసిస్తున్నారు. రంగసామి ఒక్కడే జీవిస్తున్నాడు. ఈనెల 2వ తేదీ నుంచి రంగసామి కనిపించడంలేదని అతని కుమారుడు యువరాజ్ (40) పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చేపట్టారు. దర్యాప్తులో.. రంగసామి కుజిలింపారైలోని ప్రైవేట్ ఆస్పత్రి కాపలాదారుడిగా పనిచేస్తున్న గోవిందరాజ్ (64)తో తరచూ పేకాట ఆడేవాడని, తరచూ అతని ఇంటికి వెళ్లి వస్తుండేవాడని, ఆ సమయంలో గోవిందరాజ్ కోడలితో రంగసామి వివాహేతర సంబంధం పెట్టుకున్నట్లు తెలిసింది. విషయం తెలిసిన గోవిందరాజ్ ఆక్రోశంతో ఇంటికి పిలిచి రంగసామిని కొట్టి చంపినట్లు తేలింది. మృతదేహాన్ని బస్తాలో మూటకట్టి వరట్టారు వాగు వద్దకు తీసుకెళ్లి కాల్చేశాడని తెలియడంతో పోలీసులు మంగళవారం గోవిందరాజ్‌ని అరెస్ట్ చేశారు.

నర్సుని లైంగికంగా వేధించిన వైద్యుడు...

ప్యారిస్: చెన్నై ముగప్పేర్‌లోని ఓ ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రిలో గుండె శస్త్రచికిత్స నిపుణుడిగా కర్ణాటకకు చెందిన ఉల్హాస్ పాండురంగి పని చేస్తున్నారు. వలసరవాక్కంలో నివాసం ఉంటున్నాడు. మూడు రోజుల క్రితం అదే ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సుని లైంగికంగా వేధించినట్లు తెలుస్తోంది. బాధితురాలు తిరుమంగళం ఆల్ ఉమెన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, తిరుపతిలో దాగి ఉన్న వైద్యుడిని పోలీసులు అరెస్టు చేసి సోమవారం ఎగ్మూర్ కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకి తరలించారు.

కాపలాదారుడిపై దాడి చేసిన ముగ్గురు...

మహాబలిపురం: చెంగల్పట్టు జిల్లా మహాబలిపురానికి ఆదివారం ఇద్దరు మహిళలు సహా నలుగురు వ్యక్తులు కారులో వచ్చి నోపార్కింగ్ వద్ద వాహనం ఆపడానికి ప్రయత్నించారు. అప్పుడు అక్కడ భద్రతా విధుల్లో ఉన్న కాపలాదారుడు ఏళుమలై (45) కారును అక్కడ నిలపకూడదని చెప్పాడు. ఆగ్రహించిన నలుగురు కారులో నుంచి దిగి ఏళుమలైపై దాడికి పాల్పడి పారిపోయారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మహాబలిపురం పోలీసులు కారు డ్రైవర్ సహా నలుగురిపై కేసు నమోదు చేసి కారు నెంబరు ఆధారంగా సోమవారం దర్యాప్తు చేపట్టారు. నిందితులు తాంబరం సమీప ముడిచ్చూర్‌కు చెందిన ప్రభు ఇన్బదాస్, షణ్ముగప్రియ, కీర్తనను అరెస్టు చేసి పరారీలో ఉన్న డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గ్యాస్ నింపుతుండగా వ్యాన్‌లో మంటలు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోవై ఉక్కడంలోని వంతెన వద్ద టోటల్ ఎనర్జీ సంస్థకు చెందిన పెట్రోలియం గ్యాస్ నింపే బంక్ ఉంది. మంగళవారం ఉదయం ఓ వ్యానులో గ్యాస్ నింపే సమయంలో నిప్పంటుకుంది. దీంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వాహనాన్ని కొద్ది దూరంలో ఆపి పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని 2 గంటలపాటు శ్రమించి మంటలను అదుపు చేశారు. ఈలోగా వ్యాను పూర్తిగా దగ్ధమైంది.

ఘనంగా గోవుకు సీమంతం

వేలూర్, న్యూస్‌టుడే: గర్భిణులకు సీమంతం నిర్వహించడం మామూలు. కానీ వేలూర్ సమీపంలో పంచాయతీ అధ్యక్షుడు గోవుకు సీమంతం నిర్వహించి ఔరా అనిపించాడు. వడక్కుపట్టుకు చెందిన మోహనవడివేలు పంచాయతీ అధ్యక్షుడు. ఈయన ఇంట్లో పెంచుతున్న ఆవుకు 'గుండమల్లి' అని పేరుపెట్టాడు. గర్భం దాల్చిన గుండుమల్లికి మంగళవారం సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవును ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సీమంతం ఆహ్వానపత్రిక అందజేశారు. సారె అందించి గ్రామస్థుల సమక్షంలో ఘనంగా వేడుక జరిపారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన గ్రామస్థులకు విందు ఏర్పాటు చేశారు.



అలంకరణలో ఆవు